

కలశ పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

## అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**బగలాముఖి శక్తిపీఠం ప్రథమ వార్షికోత్సవంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు**

శివ్వంపేట, ఫిబ్రవరి 29 : మెదక్ జిల్లా శివ్వంపేటలో వెలసిన బగలాముఖి శక్తిపీఠంలో ఏదో తెలియని మహత్యం ఉందని, ఈ ఆలయాన్ని దర్శించుకుంటే ప్రశాంతత కలిగిందని, ఏదో కొత్తదనం చూశానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బగలాముఖి శక్తిపీఠం ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా రెండోరోజు గురువారం హరీశ్‌రావుతోపాటు పలువురు ప్రముఖులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ సంకల్ప బలంతో శక్తిపీఠం నిర్మాణం చేసుకోవడం శివ్వంపేట ప్రజల అదృష్టమన్నారు. అందరికీ మంచి జరగాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. బగలాముఖి శక్తిపీఠం నిర్మాణంలో భాగస్వాములైన జడ్పీటీసీ పబ్బమహేశ్ గుప్తా, పబ్బరమేశ్ గుప్తా, హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్ వారి జన్మను సార్థకత చేసుకున్నారని అభినందించారు. శాస్త్రుల వెంకటేశ్వరశర్మ పట్టుదల, కార్యదీక్షతతో శక్తిపీఠం నిర్మాణం సాధ్యమైందన్నారు. తనను ప్రథమ వార్షికోత్సవానికి ఆహ్వానించిన జడ్పీటీసీ పబ్బమహేశ్ గుప్తాకు, వారి బృందానికి హరీశ్‌రావు ధన్యవాదాలు తెలిపారు.

**ప్రత్యేక పూజలు...**

ఉత్సవాల్లో శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో గోదావరి జలాలతో అష్టోత్తర శత (108) కలశస్థాపన, 108 కలశ జలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సహస్ర పుష్ప సహిత హరిద్రార్చన, పూర్ణాహుతి, మహామంగళ నీరాజనం నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త చిలువేరు శాంతన్‌కుమార్ గుప్తా, సంగీత దంపతుల ఆధ్వర్యంలో 5వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కేరళ డోలు వాయిద్యం ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాలను విజయవంతం చేసిన అందరికీ, పబ్బ మహేశ్‌గుప్తా భక్తుల కోసం టెంట్లు, చలువ పందిళ్లు, పూలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేయించడంపై వెంకటేశ్వరశర్మ కృతజ్ఞతలు తెలిపారు.

**దర్శించుకున్న ప్రముఖులు...**

లలిత త్రిపుర సందరీదేవి పీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతిస్వామి, మాధవనంద సరస్వతిస్వామి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ దంపతులు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, గోల్డ్ మెన్ చిన్నాబాయ్‌తోపాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, సింగాయపల్లి గోపి, మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పబ్బ రమేశ్ గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, తూము కృష్ణారావు, జ్ఞానేశ్వర్, పద్మా వెంకటేశ్, వంజరి కొండల్, పోచగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం వాస్తవాలను వివరిస్తాం



పొద్దు తిరుగుడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, ఫిబ్రవరి 29: కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం జరిగిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తొగుట వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆకుపచ్చ తెలంగాణ కోసం ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందన్నారు. ఉత్తర తెలంగాణకు గుండెకాయ లాంటి మేడిగడ్డ ప్రాజెక్టు మీద కాంగ్రెస్ నాయకులు అవినీతి ఆరోపణలు చేయడం హేయనీయమన్నా రు. నేడు యాసంగి పంటలు ఎండిపోతున్నాయని, రాజకీయాలు పక్కన పెట్టి సాగునీళ్లు అందించి రైతులను ఆదుకునే ప్రయత్నం చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో వాస్తవాలను ప్రజలను వివరించడానికే మేడిగడ్డ పర్యటన చేస్తున్నామన్నారు. పొద్దుతిరుగుడు పంటను తొగుట వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చి మద్దతు ధర రూ.6760 పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం క్రాంతి, సొసైటీ చైర్మన్ కె హరికృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ కుర్మ యాదగిరి, తహసీల్దార్ శ్రీకాంత్, మార్కెట్ కార్యదర్శి స్వామి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఎండీ కలీమోద్దీన్, ఎంపీటీసీలు సూతారి లలితా రమేశ్, వేల్పుల స్వామి, మండల యూత్ అధ్యక్షుడు మాదాసు అరుణ్‌కుమార్, నాయకులు సిరినేని గోవర్ధన్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్లు బక్క కనకయ్య, దొమల కొమురయ్య, వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చిలువేరి మల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య, వెంకటేశం, బైరాగౌడ్, పోచయ్య, రాజు, సుభాశ్‌గౌడ్, మంగ నరిసింహులు, అశోక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంతో సస్యశ్యామలం



ఉప్పలింగాపూర్ బ్రిడ్జి వద్ద గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

వెల్దుర్తి, ఫిబ్రవరి 29: బీడు భూములను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో లక్షలాది ఎకరాల బీడుభూములు పంటపొలాలుగా మారాయని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలు మండల పరిధిలోని హల్దీవాగులోకి ప్రవహించడంతో గురువారం ఎమ్మెల్యే ఉప్పులింగాపూర్ బ్రిడ్జి వద్ద మండల నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడిగడ్డ బరాజ్ వద్ద ఏర్పడ్డ పగుళ్లకు మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ బరాజ్‌ను మరింత ప్రమాదంలో పడేస్తుందన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి కొండపోచమ్మ సాగర్ ద్వారా గోదావరి జలాలు హల్దీ ప్రాజెక్టులో ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రాంత రైతులకు సాగు, తాగునీటి కష్టాలు తీరాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, నాయకులు కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

## మేడిగడ్డపై కాంగ్రెస్ కుట్రలు



చేర్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, ఫిబ్రవరి 29: తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌పై కాంగ్రెస్ సర్కారు కుట్రలు చేస్తున్నదని, సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నేతలపై తిట్ల పురాణం బంద్ చేసి వెంటనే రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. చేర్యాల పట్టణంలో గురువారం ఎమ్మెల్యే పల్లా విలేకరులతో మాట్లాడుతూ మేడిగడ్డపై కాంగ్రెస్ సర్కారు కుట్ర చేయడం సరికాదని, 88 పిల్లర్లలో రెండు పిల్లర్లు కుంగితే వాటిని మరమ్మతు చేయడం పక్కన పెట్టి, స్వార్థ రాజకీయాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వృథా అనడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. మాజీ మం త్రులు కేటీఆర్, హరీశ్‌రావుల ఆధ్వర్యంలో మేడిగడ్డకు జనగామ నియోజకవర్గం నుంచి ముఖ్య నాయకులతో కలిసి వెళ్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే సీఎం హోదా మర్చిపోయి ప్రతిపక్షంపై పరుషపదజాలంతో దూషిస్తున్నారని, ఇది తగదన్నారు. బీఆర్ఎస్ పాలనలో చేర్యాల పట్టణం సమగ్రాభివృద్ధి చెందిందని, రానున్న రోజుల్లో చేర్యాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు విశ్రమించేదిలేదని, ఇప్పటికే అసెంబ్లీలో డివిజన్ ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించడమే కాకుండా సంబంధిత శాఖ మంత్రికి లేఖలను సైతం అందజేసినట్లు తెలిపారు. గతేడాది తాను మంజూరు చేయించిన రూ.10కోట్లను మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు కేటాయించాలని మున్సిపల్ తీర్మానించినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్, ఏఈ, కౌన్సిలర్లతో వార్డుల్లో పర్యటించి రూ.10కోట్ల నిధుల నుంచి అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపా రాణి శ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ పుర్మ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, నాయకులు ముస్త్యాల బాలనర్సయ్య, శివగారి అంజయ్య, యాట యాదగిరి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, పచ్చిమడ్ల సిద్దిరాములు, చేతిరెడ్డి సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే**

బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒక్కసారి నిర్వహించుకునే పుట్టిన రోజు వేడుకలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై ఆయనతో కేకును కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చేర్యాల పట్టణంలోని ఫంక్షన్‌హాలులో జరిగిన గురువన్నపేట మాజీ ఉపసర్పంచ్ తుక్కోజు నర్సింహులు కుమారుడు కిషన్ పెండ్లికి, సిద్దిపేట పట్టణంలోని వీఎస్ఎస్ గార్డెన్స్‌లో జరిగిన మద్దిముచ్చాలకు చెందిన వ్యాపారి కూర ధనలక్ష్మీ వెంకటేశ్వర్ల ద్వితీయ కుమార్తె మానస వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

**జిల్లాలో రిజర్వాయర్లు..**

కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ – 10లో భాగంగా మిడ్‌మానేరు నుంచి గోదావరి నీటిని 3.50 టీఎంసీల కెపాసిటీ గల అన్నపూర్ణ రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లాకు 30వేల ఎకరాల ఆయకట్టు, సిద్దిపేట జిల్లాకు 15,200 ఎకరాలు సాగులోకి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ –11లోఅన్నపూర్ణ నుంచి రంగనాయకసాగర్ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోస్తున్నారు. దీని కెపాసిటీ 3 టీఎంసీల సామర్థ్యం. ఈ రిజర్వాయర్ నుంచి లక్షా 10 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను 23 ఫిబ్రవరి, 2022 కొండపోచమ్మ రిజర్వాయర్‌ను 29 మే, 2020లో మాజీ సీఎం కేసీఆర్ జాతికి అంకితం చేశారు. బెజ్జంకి మండలం తోటపల్లి వద్ద 0.32 టీఎంసీల సామర్థ్యంతో తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్, కొమురవెల్లి మండలం ఐనాపూర్ – తపాస్‌పల్లి గ్రామాల మధ్య తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను 0.50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలంలో గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీని సామర్థ్యం 8.23 టీఎంసీలు. ఇటీవలే ట్రయల్ రన్ సైతం నిర్వహించారు.

కేసీఆర్ భగీరథ ప్రయత్నంతో బీడు భూములు సస్యశ్యామలం

గోదావరి జలాల రాకతో తీరిన సాగునీటి కష్టాలు

బీఆర్ఎస్ పాలనలో మండుటెండల్లో జలకళ తో ఉట్టిపడిన సాగునీటి వనరులు

భారీగా పంటలు పండించిన అన్నదాతలు

ఆదుకున్న రైతుబంధు, రైతుబీమా పథకాలు

ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు తీరుతో అన్నదాతల ఆందోళన

# మెతుకుసీమకు వరప్రదాయిని

**కాళేశ్వరం ప్రాజెక్టుతో ఉమ్మడి మెదక్ జిల్లాలో మారిన సాగు స్వరూపం**

**సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు** కాళేశ్వరం ప్రాజెక్టు వరప్రదాయినిగా మారింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ సర్కారు లక్షల ఎకరాలకు సాగునీరు అందించింది. కేసీఆర్ భగీరథ ప్రయత్నం, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నిరంతర కృషితో గోదావరి జలాలు బీడు భూములను సస్యశ్యామలం చేశాయి. రిజర్వాయర్ల నిర్మాణంతో సిద్దిపేట జిల్లాలో పంటల సాగువిస్తీర్ణం పెరిగి రికార్డు స్థాయిలో దిగుబడులు వచ్చాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో జిల్లాలో సాగు స్వరూపం పూర్తిగా మారిపోయింది. నేడు బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం కాళేశ్వరం ప్రాజెక్టులోని 'మేడిగడ్డ బరాజ్' పర్యటన నేపథ్యంలో ప్రత్యేక కథనం.

– సిద్దిపేట, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**రిజర్వాయర్ల నిర్మాణం..**

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలో అన్నపూర్ణ, రంగనాయక సాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లు నిర్మించింది. ఈ రిజర్వాయర్ల కింద కాల్వలు నిర్మించి చెరువులు, కుంటలు నింపింది. దీంతో మండుటెండల్లోనూ చెరువులు అలుగు పారాయి. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి ట్రయల్‌రన్ నిర్వహించింది. రాష్ట్రంలో అత్యధికంగా రిజర్వాయర్లు సిద్దిపేట జిల్లాలో నిర్మాణమయ్యాయి.



గత ఆగస్టు మాసంలో రంగనాయక సాగర్‌లోని గోదావరి నీళ్లను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



కొండపోచమ్మ సాగర్

**కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్**

కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. కేంద్ర జల సంఘం సూచనల మేరకు వ్యవసాయం, తాగునీరు, పరిశ్రమలకు నీటిసరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు తొగుట మండలం దగ్గర ఈ భారీ రిజర్వాయర్‌ను ఏర్పాటు చేశారు. ఈ రిజర్వాయర్‌లో భాగంగా ముంపునకు గురైన గ్రామాల్లోని 5,205 కుటుంబాలకు గజ్వేల్ మండలంలోని ముట్రాజ్‌పల్లి, సంగాపూర్ గ్రామాల్లో 600 ఎకరాల్లో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మించి ఇండ్లు కేటాయించారు. ఈ రిజర్వాయర్ ను 23 ఫిబ్రవరి, 2022లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జాతికి అంకితం చేశారు. రిజర్వాయర్ మొత్తం పొడవు 22. 600 కి.మీటర్లు. ఈ రిజర్వాయర్ కు 5 ప్రధాన తూములు నిర్మించగా, 16,43,665 ఎకరాలకు నీటి సరఫరా కోసం ప్రతిపాదించడం జరిగినది. దీనిలో 12,18,080 ఎకరాల కొత్త ఆయకట్టుకు ప్యాకేజ్ 12,13,14,15,16,18, 19 ద్వారా నీరు అందించేందుకు ప్రతిపాదించారు. సింగూర్ ప్రాజెక్టు, వనదుర్గ (ఘనపూర్ ఆనకట్ట), నిజాంసాగర్, తపాసుపల్లి రిజర్వాయర్ల కింద 4,25,585 ఎకరాల ఆయకట్టుకు నీటిని అందిస్తున్నారు.

**మల్లన్నసాగర్ రిజర్వాయర్‌తో 10 జిల్లాలు... 24 నియోజకవర్గాలకు లబ్ధి**

మల్లన్నసాగర్ రిజర్వాయర్ ద్వారా మిషన్ భగీరథలో భాగంగా మంగోలు గ్రామంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించి దాని నుంచి 540 మిలియన్ లీటర్ పర్ డే (ఎంఎల్‌డి) శుద్ధ తాగు నీటిని 7 జిల్లాల్లోని 10 నియోజకవర్గాలకు సరఫరా చేస్తున్నారు. 270 మిలియన్ లీటర్ పర్ డే (ఎంఎల్‌డీ)శుద్ధతాగు నీటి సరఫరా వ్యవస్థను 10 ఏప్రిల్ 2023న అప్పటి మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావులు ప్రారంభించారు. మల్లన్నసాగర్ ద్వారా 10 జిల్లాలు, 24 నియోజకవర్గాలు లబ్ధి పొందుతున్నాయి.

**గౌరవెల్లి ప్రాజెక్టు సామర్థ్యం 8.23 టీఎంసీలు**

సిద్దిపేట జిల్లాలోని గౌరవెల్లి ప్రాజెక్టును ఇందిరమ్మ ఫ్లడ్ ఫ్లో కెనాల్ కింద 2008 –09 సంవత్సరంలో ప్రారంభించారు. దీనికి నీటిని ఎస్సారెస్పీ ఫ్లడ్ ఫ్లో ద్వారా మిడ్ మానేరుకు తీసుకువచ్చి అక్కడి నుంచి తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్ ద్వారా గౌరవెల్లి లిఫ్ట్ కెనాల్ ద్వారా నింపేలా ప్రణాళిక చేశారు ఈ ప్రాజెక్టును ప్రారంభించినప్పుడు దీని సామర్థ్యం 1.41 టీఎంసీలు మాత్రమే.. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ప్రాజెక్టుల రీడిజైనింగ్‌లో భాగంగా 2015లో అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి తన్నీరు హరీశ్‌రావు, అప్పటి స్థానిక ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్, వినోద్‌కుమార్‌లతో కలిసి గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్ల నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించి 2015లో గౌరవెల్లి సామర్థ్యాన్ని 1.41 టీఎంసీ నుంచి 8.23 టీఎంసీలకు పెంచారు. లక్షల ఎకరాలకు సాగునీరందించి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా యుద్ధప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేసింది. మిడ్‌మానేరు నుంచి తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలు గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి ట్రయల్ రన్ చేసిన విషయం తెలిసిందే. తోటపల్లి నుంచి నార్లపూర్ వరకు 8 కి.మీటర్ల లింక్ కెనాల్ ద్వారా నీళ్లు తీసుకొచ్చి అక్కడినుంచి గొట్లమిట్ట వరకు 3 కి.మీటర్ల అప్రోచ్ కెనాల్ నుంచి సుమారుగా 12 కి.మీటర్ల మేర సొరంగం ద్వారా రేగొండ పంప్ హౌస్‌కు గోదావరి జలాలు తరలిస్తారు. రేగొండ వద్ద ఏర్పాటు చేసిన పంపుల ద్వారా నీటిని గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి ఎత్తి పోస్తారు. 32 మెగావాట్ల సామర్థ్యంతో 3 మోటార్లు 126 మీటర్లు ఎత్తిపోసే విధంగా మహాబలి మోటర్లు బిగించారు.

**అన్నపూర్ణ (అనంతగిరి) రిజర్వాయర్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి, సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లీపూర్, ఎల్లాయిపల్లి, కొచ్చగుట్టపల్లి గ్రామాల మధ్య అన్నపూర్ణ (అనంతగిరి 3.50 టీఎంసీల సామర్థ్యం) రిజర్వాయర్‌ను నిర్మించారు. సుమారుగా రూ. 2,700 కోట్లతో చేపట్టారు. కాళేశ్వరం ప్యాకేజీ– 10లో భాగంగా శ్రీ రాజరాజేశ్వర రిజర్వాయర్ నుంచి నీటిని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలం తిప్పారం వద్ద 92 మీటర్ల లోతులో ఆసియాలోనే అతి పెద్ద ఓపెన్ సర్జ్‌పుల్ పంపు నిర్మించారు. ఒక్కో పంపు 106 మెగా వాట్లతో కలిగినవి నాలుగు, 120 మెగా వాట్ల ట్రాన్స్‌ఫార్మర్లను నాలుగింటిని బిగించారు. ఈ రిజర్వాయర్‌తో సిద్దిపేట జిలాలోని చిన్నకోడూరు, బెజ్జంకి మండలాల్లో 15,200 ఎకరాలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలంలో 14,000 ఎకరాలు, కరీంనగర్ జిల్లాలోని గన్నేరువరం మండలంలో 800 ఎకరాలకు సాగునీరందుతుంది.



వనదుర్గా ప్రాజెక్టు

**నిజాంసాగర్‌కు జీవం పోసి..**

కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి నిజాంసాగర్ వరకు నీటిని అందించి భరోసా కల్పించారు. కొండపోచమ్మ నుంచి సంగారెడ్డి కెనాల్ ద్వారా హల్దీ వాగు, మంజీరా గుండా 90 కి.మీటర్లు ప్రయాణించి కామారెడ్డి జిల్లా నాగిరెడ్డి పేట మండలం గొల్లిలింగాల వద్ద నిజాంసాగర్‌లో గోదావరి జలాలు కలిశాయి. వర్గల్ మండలం (సంగారెడ్డి కెనాల్ నుంచి)లో వరుసగా 4 పెద్ద చెరువులతో పాటు హల్దీవాగుపైన 32 చెక్‌డ్యామ్‌లను నిండాయి. వీటిలో సిద్దిపేట జిల్లాలో 9, మెదక్ జిల్లాలో 23 చెక్‌డ్యాంలను నింపారు.

**రైతుబంధు కింద రూ. 8,771 కోట్లు**
**రైతుబీమా 803. 05 కోట్లు**

కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ప్రారంభించినప్పటి నుంచి 2023 ఆగస్టు వరకు 11 విడతల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో 85,99,091 మంది రైతులకు రూ. 8,771.73 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. రైతుబీమా కింద 16,061 మంది రైతు కుటుంబాలకు రూ. 803.05 కోట్లు వారి ఖాతాల్లో జమచేసింది.

**కేసీఆర్ ప్రభుత్వంలో సిరుల పంటలు**

ఉమ్మడి రాష్ట్రంలో తాగు, సాగునీళ్లు లేక కరువు కాటకాలకు నిలయంగా ఉన్న పాత మెదక్ జిల్లా కేసీఆర్ ప్రభుత్వంలో గోదావరి నీళ్లతో సస్యశ్యామలమయింది. ఎక్కడో పుట్టిన గోదావరిని జిల్లాకు తీసుకవచ్చి బీడు భూముల్లో పారించడంతో పచ్చని పంట పొలాలతో గత ప్రభుత్వంలో కోనసీమను తలపించింది. పల్లెల్లో ఎక్కడ చూసినా ధాన్యపు రాశులు కనిపించాయి. రైతుబంధు, రైతుబీమా, నిరంతర విద్యుత్, సాగునీరు, పంటకొనుగోల కేంద్రాలు ఇవన్నీ కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు కలిసి వచ్చాయి.



మల్లన్న సాగర్



రంగనాయక సాగర్

**రంగనాయక సాగర్ రిజర్వాయర్**

సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ – పెద్దకోడూరు గ్రామాల శివారులో రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ను 3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 11లో భాగంగా నిర్మించిన ఈ రిజర్వాయర్ బండ్ 8.65 కి.మీ పొడవు ఉంటుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్నపూర్ణ రిజర్వాయర్ (బండ్ ) 1.746 కి.మీ వద్ద స్లూయిస్(తూం)ను ఏర్పాటు చేసి నాలుగు గేట్లను బిగించారు. హెడ్‌రెగ్యులేటర్ ద్వారా గ్రావిటీ కెనాల్, సొరంగం ద్వారా గోదావరి జలాలు శ్రీ రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్నారు. ఈ రిజర్వాయర్‌ను 24 ఏప్రిల్–2020లో అప్పటి మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, కె.తారక రామారావు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. రంగనాయక సాగర్ ఎడమ కాల్వ ద్వారా 70,000 ఎకరాలు కుడి కాల్వ ద్వారా 40,000 ఎకరాలు ఆయకట్టు ప్రతిపాదించారు. సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నంగనూర్, నారాయణరావుపేట్, చిన్నకొడూరు, బెజ్జంకి మండలాల్లో 51 గ్రామాల్లో 76,931 ఎకరాల ఆయకట్టు, రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఇల్లంతకుంట, ముస్తాబాద్, తంగళ్ళపల్లి మండలాల్లోని 29 గ్రామాల్లో 33,069 వేల ఎకరాలు ఎకరాల ఆయకట్టు ప్రతిపాదించారు.

**కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్**

కొండ పోచమ్మ సాగర్ రిజర్వాయర్ 15టీఎంసీల సామర్థ్యంతో మర్కుక్ మండలం పాములపర్తి వద్ద నిర్మించారు. ఈ రిజర్వాయర్ ముంపునకు గురైన గ్రామాలకు చెందిన 1860 నిర్వాసిత కుటుంబాలకు ములుగు మండలం తునికి బొల్లారం గ్రామంలో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మించారు. ఈ రిజర్వాయర్‌ను 29 మే, 2020లో మాజీ సీఎం కేసీఆర్ జాతికి అంకితం చేశారు. ఈ రిజర్వాయర్ మొత్తం పొడవు 15 కి.మీ . ఈ రిజర్వాయర్‌కు 4 ప్రధాన తూములు నిర్మించారు. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ ద్వారా 2,85,280 ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. ఈ రిజర్వాయర్ కింద 5 జిల్లాలు, 10 నియోజకవర్గాలకు లబ్ధి చేకూరనున్నది. కాల్వల నిర్మాణానికి అవసరమైన 4,636 ఎకరాలకు గాను 4,636 ఎకరాలను సేకరించారు. కొండపోచమ్మ సాగర్ ద్వారా 2,85,280 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు 8 కాల్వల పనులు జరుగుతున్నాయి.

**కూడవెల్లి వాగు నుంచి ఎగువ మానేరు**

కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కూక్ మండలంలో చేబర్తి పెద్దచెరువు వద్ద కుడ్లేరు వాగు ప్రారంభమవుతుంది. ఇదే వాగును కూడవెల్లి వాగుగా పిలుస్తారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ ద్వారా సిద్ధిపేట జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గంలో కూడెల్లి వాగుకు, దాని ఎగువన నిర్మించిన 33 చెక్ డ్యామ్‌లకు 2020–21 నుంచి 6,308 ఎకరాల ఆయకట్టుకు నీరందించారు. గజ్వేల్ నియోజకవర్గంలో 9 చెక్ డ్యామ్‌ల కింద 2,380 ఎకరాల ఆయకట్టు పారుతుంది. ఈ క్రమంలో కూడెల్లి వాగు జీవనదిగా మారి ఎగువ మానేరు డ్యామ్ వరకు నీరు అందించడంతో పాటు దాని కింద 16,000 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. ఈ వాగుపై మొత్తం 39 చెక్‌డ్యామ్‌లు ఉన్నాయి. కూడవెల్లి వాగుతో గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కూక్, జగదేవ్‌పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట, మిరుదొడ్డి ,దుబ్బాక మండలాల మీదుగా రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలంలోని ఎగువమానేరు వరకు ప్రవహించి చెక్‌డ్యామ్‌లను నింపింది.